క్లుప్తంగా

సకాలంలో బిల్లులు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ శ్రీనివాసరావు

రేగిడి: జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లకు ఏపీడీ మీసాల శ్రీనివాసరావు సూచించారు. గురువారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేతన దారులు కోరిన చోట పనులు కల్పించాలని సూచించారు. పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి ఉన్న రైతులకు మొక్కలు అందజేసి ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ ఎస్.హరనాథరావు, ఈసీ రామినాయుడు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నాణ్యత పరిశీలన



నాణ్యత పరిశీలిస్తున్న డీఈఈ, తదితరులు

రేగిడి: మండలంలోని వన్నలిలో ఇటీవల చేపట్టిన సీసీ డ్రైనేజీ నిర్మాణాల నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ డీఈఈ రమణ ప్రభాష్ గురువారం పరిశీలించారు. శాంపిల్స్ సేకరించడంతో పాటు పనులకు వినియోగించిన సామగ్రి వివరాలపై ఆరా తీశారు. గ్రామంలో రెండుచోట్ల రూ. 6 లక్షల గడప గడపకు.. నిధులతో చేపట్టిన పనులు పరిశీలించామని, నాణ్యత ప్రమాణాలు పాటించారన్నారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఏఈ చైతన్య, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రాజేష్, ఏఈ శ్రీచరణ్, పంచాయతీ సర్పంచ్ గార రమణ, తదితరులు పాల్గొన్నారు.

క్లాప్‌మిత్రలకు సత్కారం



క్లాప్ మిత్రలను సత్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు

రాజాం: మండలంలోని పలు గ్రామాల్లో క్లాప్‌మిత్రలను గురువారం సత్కరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లావేటి సులోచన, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, వైస్ ఎంపీపీలు నక్క వర్షిణి, యాలాల వెంకటేష్ వీరిని సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాసూరి శంకరరావు, పంచాయతీ విస్తరణాధికారి వావిలపల్లి శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు, వంజరాపు విజయ్‌కుమార్, కొర్ను ఈశ్వరరావు, ఏపీఎం దధికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన హిందీ పక్షోత్సవాలు



ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న మధుసూదనరావు

రాజాం: హిందీ దివస్ సందర్భంగా ఈ నెల 14న ప్రారంభమైన హిందీ భాషా పక్షోత్సవాలు గురువారంతో ముగిశాయి. 15 రోజులుగా మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో హిందీ ప్రచారక్ కె.మధుసూదనరావు కార్యక్రమాలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమాన్ని ప్రభుత్వ కస్తూరీబా గాంధీ బాలికల విద్యాలయంలో చేపట్టారు. ఈ సందర్భంగా హిందీ భాష విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో శోభ, బీఎల్ నాయుడు, మంజుల, ఈశ్వరరావు, రాముడమ్మ, లలితకుమారి, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



నియామకపత్రం అందుకుంటున్న వైకుంఠరావు

రాజాం: మండలంలోని మారేడుబాక గ్రామానికి చెందిన గంగ్రేటి వైకుంఠరావు ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం మండల రిసోర్స్ కో ఆర్డినేటర్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో సాక్షరభారత్ మండల కోఆర్డినేటర్‌గా ఈయన సేవలు అందించారు. అప్పట్లో టీడీపీ ప్రభుత్వం తమను తొలగించగా.. జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు ఇచ్చారని వైకుంఠరావు సాక్షికి తెలిపారు. ఇదిలా ఉండగా ఎంపీడీఓ బాసూరి శంకరరావు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులతో కలిసి వైకుంఠరావుకు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, వంజరాపు విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రతిపక్షానికి చిత్తశుద్ధి లేదు..

- అందుకే అసెంబ్లీలో చర్చకు రాలేదు...
- రాజ్యాంగ నిబంధనలకు లోబడే చంద్రబాబు అరెస్టు
- ఎమ్మెల్యే శంబంగి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో రూ.361 కోట్ల అవినీతి చేసిన కేసులో అరెస్టయిన చంద్రబాబు గూర్చి అసెంబ్లీలో చర్చిద్దామని స్పీకర్ తమ్మినేని సీతారాం ఇచ్చిన పిలుపును పక్కనపెట్టిన ప్రతిపక్ష సభ్యులు అల్లరి, చిల్లరి చేష్టలతో కావాలనే సస్పెండయ్యారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం నియోజకవర్గానికి వచ్చిన ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోడియంలోకి వెళ్లి దురుసుగా ప్రవర్తించడం, పేపర్లను చించేయడం, గ్లాసును ధ్వంసం చేసే ప్రయత్నం చేయడం, ఎంత త్వరగా సస్పెండ్ చేస్తే అంత త్వరగా బయటకు వెళ్లిపోదామనే ప్రయత్నాలతో టీడీపీ ఎమ్మెల్యేలు నానా రభస చేశారే తప్ప చర్చించేందుకు ముందుకు రాలేదన్నారు. చర్చకు రాకుండా నానా రభస చేయడానికి కారణం వారిలోనూ ఇద్దరు ముగ్గురు ముద్దాయిలున్నట్టున్నారని ఎద్దేవా చేశారు. నలభై సంవత్సరాల అనుభవమున్న ఓ మాజీ ముఖ్యమంత్రిని అరెస్టు చేయడం తేలిగ్గా తీసుకోరని, ముందుగా రెండేళ్ల పాటు ఈడీ చేపట్టిన దర్యాప్తు అనంతరం దీని వెనుక లభించిన బలమయిన సాక్ష్యాధారాలే ఆధారమన్నారు. చంద్రబాబును అవినీతి మకిలి నుంచి కాపాడేందుకు టీడీపీ నాయకులు ఢిల్లీ నుంచి తీసుకువచ్చిన ఖరీదయిన లాయర్లు సైతం అరెస్టు విషయమే మాట్లాడుతున్నారు తప్ప అవినీతి లేదని చెప్పలేకపోవడం విశేషమన్నారు. ఇన్నర్ రింగ్‌రోడ్డు, వివిధ అవినీతి కార్యకలాపాల పైనా అసెంబ్లీలో స్లైడ్‌షోలు వేసి చూపారన్నారు. వీటిపై కూడా త్వరలో చట్టపరమయిన చర్యలుండొచ్చన్నారు.

దశాబ్దాల సమస్యలకు పరిష్కారం

దశాబ్దాలుగా చుక్కల భూములు, 22ఏ భూముల సమస్యలకు శాసనసభ సమావేశాల్లో బిల్లులు ఆమోదం పొందడం అభినందనీయమని ఎమ్మెల్యే శంబంగి అన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, జీపీఎస్ వంటి అంశాలపై బిల్లు పాసవడం అభినందనీయమన్నారు. ఈ నెల 30 నుంచి చేపట్టనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఆయనతో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, మాజీ మున్సిపల్ చైర్మన్, మాజీ వైస్ చైర్మన్‌లు ఇంటి గోపాలరావు, చోడిగంజి రమేష్‌నాయుడు ఉన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా

- ట్రాన్స్‌కో ఎస్ఈ లక్ష్మణరావు



విద్యుత్ సబ్‌స్టేషన్ పరిశీలిస్తున్న ఎస్ఈ లక్ష్మణరావు

వంగర: జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ట్రాన్స్‌కో ఎస్ఈ ఎం.లక్ష్మణరావు అన్నారు. మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణలో తలెత్తిన సమస్యలను వెంటవెంటనే పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా విద్యుత్ మీటర్లకు ఆధార్ అనుసంధానం వేగవంతం చేశామని, అలాగే గ్రామాల్లో విద్యుత్ బకాయిలు వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సమస్యలను 1912 కాల్ సెంటర్‌కు తెలియజేయాలని సూచించారు. కొత్త విద్యుత్ మీటర్లకు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఈ జి.సురేష్‌బాబు, డీఈ బీవీ ఫణీంద్రకుమార్, ఏఈ కోనూరు వినయ్ కుమార్, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి



రేగిడి: ఆర్‌బీకే వద్ద ఈకేవైసీ పరిశీలిస్తున్న ఏఓ మురళీకృష్ణ



వంగర: మగ్గూరులో ఈకేవైసీ చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

రేగిడి: మండలంలోని ప్రతి రైతూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి జి.మురళీకృష్ణ సూచించారు. సోమరాజుపేటలో జరుగుతున్న ఈకేవైసీని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ, మండలంలో 11,600 ఎకరాల్లో సాగుకు ఈకేవైసీ చేయడం జరిగిందని తెలిపారు. 11,490 మంది రైతులకు గాను 5,209 మంది ఈకేవైసీ చేయించుకున్నారన్నారు.

ఈ నెలాఖరులోగా..

వంగర: ఈ నెలాఖరు నాటికి అన్ని గ్రామాల్లో ఈకేవైసీ పూర్తి చేయాలని ఏఓ తట్టికోట కన్నబాబు తెలిపారు. మండల పరిధిలోని వంగర, మగ్గూరు, ఓనె అగ్రహారం, సంగాం, కొప్పరవలస గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా ఈకేవైసీ నమోదుపై విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లతో చర్చించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మండలంలోని 8,500 ఎకరాలకు ఈ-క్రాప్ నమోదు చేశామన్నారు, అలాగే 19 రైతుభరోసా కేంద్రాల పరిధిలో 4959 మంది రైతులకు గాను ఇంతవరకు రెండు వేల మంది ఈకేవైసీ పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

పేదలకు చీరలు, దుప్పట్ల పంపిణీ



బ్రహ్మన్నవలసలో పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ జయంతి

బాడంగి: సమాజంలో ఉన్నవారని లేనివారని తరతమ బేధాలు లేకుండా అందరూ సమైక్యతతో గ్రామాభివృద్ధికి పాటుపడాలని ఎస్ఐ ఆర్.జయంతి అన్నారు. మండలంలోని కోడూరు పంచాయతీ శివారు గ్రామం బ్రహ్మన్నవలసలోని నిరుపేద కుటుంబాల వారికి తన స్వంత ఖర్చుతో చీరలు, దుప్పట్లు గురువారం పంపిణీ చేశారు. సుమారు 20 వేల రూపాయల విలువ చేసే 85 చీరలు, 100 దుప్పట్లు పంపిణీ చేసినట్టు చెప్పారు. మండలంలోని గిరిజన గ్రామం బ్రహ్మన్నవలస గ్రామస్తులను ఎంపిక చేసుకొని ఇలాంటి సేవా కార్యక్రమాన్ని చేపట్టడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ఏఎస్ఐ కొండలరావు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు

రాజాం సిటీ: ప్రజలకు అందించిన సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు వస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇటీవల ఈఓపీఆర్డీలుగా పదోన్నతి పొందిన పంచాయతీ కార్యదర్శులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగులు ఎక్కడున్నా అంకితభావంతో పనిచేసి ప్రజల మన్ననలు చూరగొనాలని ఆకాంక్షించారు. పదోన్నతి పొందిన వారిలో జి.రామకృష్ణ, కె.రామారావు , ఎ.గోపాలరావు, టి.కృష్ణారావు, కె.పద్మజ , ఎం.విజయలక్ష్మి ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, పీఏసీఎస్ అధ్యక్షుడు వి.చిన్నారావు, ఎంపీడీఓ బాసూరి శంకరరావు, ఈఓపీఆర్డీ వి.శ్రీనివాసరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నవయుగ వైతాళికుడు జాషువా

రాజాం సిటీ: నవయుగ వైతాళికుడు గుర్రం జాషువ అని ఎస్సీ సంక్షేమ సంఘ సభ్యుడు బొత్స జానకీరావు అన్నారు. గురువారం స్థానిక తెలగవీధి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో జాషువ 129వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జానకీరావు మాట్లాడుతూ, జాషువా తన కవిత్వంతో సమాజంలోని రుగ్మతలపై పోరాటం చేశారన్నారు. ఛీత్కారాలు పొందిన చోటే సత్కారాలు పొందిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ సంఘ నాయకులు జరజాన నీలయ్య, నక్క తవిటయ్య, తవిటిరావు వడ్డి పాపారావు, ఎం.కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను వినియోగించుకోవాలి



కంచరాంలో కార్డులు అందిస్తున్న ఎంపీడీఓ, తదితరులు

రాజాం: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు, పంచాయతీ విస్తరణ అధికారి వావిలపల్లి శ్రీనివాసరావు కోరారు. మండలంలోని కంచరాం సచివాలయం వద్ద సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో సర్వే చేపట్టనున్న విషయం ముందుగా ప్రజలకు తెలియజేయాలన్నారు. ఇంట్లో ఎవరైనా జ్వరాలతో బాధపడుతున్నా, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నా వైద్యుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. అనంతరం పలువురికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్డులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ గెడ్డాపు సబ్బమ్మ, ఎంపీటీసీ సభ్యుడు రాంబాబు, గ్రామ సచివాలయ కన్వీనర్ గెడ్డాపు అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

తెర్లాం: మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జరగనుందని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు హాజరు కావాలని ఆయన కోరారు.

పీడీఎస్ బియ్యం వేలం

తెర్లాం: స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్‌లో 305 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని శుక్రవారం ఉదయం 11గంటలకు వేలం వేయనున్నట్లు తహసీల్దార్ డి.రత్నకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రాంతాల్లో 6ఏ కేసుల కింద సీజ్ చేసిన బియ్యాన్ని జేసీ ఆదేశాల మేరకు వేలం వేస్తున్నామని, రూ.2వేలు ధరావత్తు చెల్లించిన వారంతా వేలం పాటలో పాల్గొనవచ్చని చెప్పారు.

కార్మిక హక్కులను కాలరాస్తోంది..

రేగిడి: కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు అన్నారు. మండలంలోని సంకిలి ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం వద్ద కార్మికులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం కార్మికవర్గాన్ని అణగదొక్కుతోందన్నారు. కార్మిక వ్యతిరేక చట్టాలను ఏకపక్షంగా ఆమోదించి, అమలు చేస్తోందని, ఇది చాలా దారుణమన్నారు. తక్షణమే గుర్తింపు పొందిన జాతీయ కార్మిక సంఘాలతో చర్చించి, కార్మికులకు నష్టం చేకూర్చే విధానాలను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్, సతీష్, నాయుడు, శ్రీనివాసరావు, దాలినాయుడు, రాంబాబు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

షిర్డీ సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు

సంతకవిటి: మండలంలోని రంగారాయపురం, గరికిపాడు గ్రామాలలో వెలసిన షిర్డీ సాయిబాబా ఆలయాలలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబా జన్మదినం సందర్భంగా ఉదయం కాకడ హారతి, సుప్రభాతం, అభిషేకం, సామూహిక సత్య వ్రతాలు, మధ్యాహ్న హారతి, సాయంత్రం ఊరేగింపు కార్యక్రమాలు అత్యంత భక్తి శ్రద్ధలతో చేపట్టారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.


గణనాథుడికి అరటిపండ్ల నివేదన




గణనాథుడి విగ్రహానికి వేసిన అరటిపండ్ల దండ

రాజాం: మండలంలోని మొగిలివలస శివాలయం వద్ద గణనాథుడికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక విగ్రహాన్ని అరటిపండ్ల దండతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనాలు



రేగిడి : గణనాథుడ్ని ఊరేగిస్తున్న దృశ్యం



సంతకవిటి: మండాకురిటిలో తిరువీధిలో వినాయకుడు

రేగిడి: మండల కేంద్రంతో పాటు వండానపేట, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, వన్నలి, తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకుల్ని గురువారం సాయంత్రం మేళతాళాల నడుమ ఊరేగిస్తూ నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఆయా వినాయక మంటపాల వద్ద మధ్యాహ్నం భారీ అన్నసంతర్పణలు నిర్వహించారు.

ఘనంగా ..

సంతకవిటి: మండలంలోని మండవకురిటి గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకుడ్ని ఘనంగా నిమజ్జనం చేశారు. మందుగా సర్పంచ్ బి.జ్యోతీశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు ఆరువేల మందికి అన్నదానం నిర్వహించారు. నిమజ్జనంలో యువత నృత్యాలు చేస్తూ, సందడి చేశారు.

పక్కాగా ఈ క్రాప్



రామభద్రపురంలో ఈ క్రాప్ నమోదు చేస్తున్న వీఏఏ కొండలరావు

రామభద్రపురం: ఖరీఫ్ సాగుకు సంబంధించి ఈ క్రాప్ నమోదును నియోజకవర్గంలోని వ్యవసాయ శాఖ పక్కాగా అమలు చేస్తోంది. గత 25 రోజులుగా నమోదు ప్రక్రియను అధికార యంత్రాంగం వేగవంతం చేయడంతో వ్యవసాయ, ఉద్యాన శాఖ సిబ్బంది నిమగ్నమయ్యారు. నియోజకవర్గంలోని 4 మండలాల పరిధిలో ఎకరాల్లో 44,799 వివిధ రకాల పంటలు సాగవుతుండగా వీటిలో ఇప్పటి వరకు 42,006 ఎకరాలకు ఈ క్రాప్ నమోదు పూర్తి చేశారు. ఇందులో రామభద్రపురం మండలం సాధారణ విస్తీర్ణం 6911 ఎకరాలకుగాను 6716 ఎకరాలు, బొబ్బిలి మండలం 16,274 ఎకరాలకుగాను 15,941 ఎకరాలు, బాడంగి మండలంలో 8557 ఎకరాలకుగాను 8282 ఎకరాలు, తెర్లాం మండలంలో 13,057 ఎకరాలకుగాను 11,067 ఎకరాలకు ఈ క్రాప్ నమోదు చేశారు. నియోజకవర్గంలోని ఈ క్రాప్ నమోదులో రామభద్రపురం మండలం 99 శాతం నమోదై ప్రథమ స్థానంలో ఉండగా, బొబ్బిలి మండలం 98 శాతంతో ద్వితీయ స్థానంలో ఉంది. బాడంగి మండలం 97 శాతం నమోదు కాగా తెర్లాం మండలంలో 85 శాతం నమోదై నియోజకవర్గంలో ఆఖరి స్థానంలో ఉంది. నియోజకవర్గం వ్యాప్తంగా ఈ క్రాప్ నమోదు పారదర్శకంగా జరుగుతోంది. ఇప్పటి వరకు 42,006 ఎకరాల్లో ఈ క్రాప్ పూర్తయింది. మిగతా 2,793 ఎకరాలకు వివరాల నమోదును వేగవంతం చేశామని, ఈ నెల ఖరులోగా పూర్తి చేస్తామని సంబంధిత అధికారులు తెలిపారు.

పకడ్బందీగా 'ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు

రామభద్రపురం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఈ నెల 30 నుంచి పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన ఎంపీడీఓ రమామణి, తహసీల్దార్ రాజారావు, హౌసింగ్ ఏఈఈ సింహాచలంనాయుడుతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 30 నుంచి మండల వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించాల్సి ఉందన్నారు. తహసీల్దార్, ఎంపీడీఓ మండల, గ్రామ స్థాయి అధికారులను సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రజల కోసం హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసి అందులో ఏఎన్ఎం, ఆశా వర్కర్లను నియమించాలని సూచించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసే ప్రాంతంలో అంతా పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

ఈకేవైసీ తరువాతే పాస్ పుస్తకాల పంపిణీ : ఆర్‌డీఓ



రైతులకు భూహక్కు పత్రాల పంపిణీని పర్యవేక్షిస్తున్న ఆర్‌డీఓ శేషశైలజ

బొబ్బిలి: రీసర్వే పూర్తయిన గ్రామాలకు వచ్చిన పట్టాదారు పాసుపుస్తకాలను (భూహక్కు పత్రాలు)ఆయా రైతులకు ఈకేవైసీ చేసిన తరువాత అందజేయాలని ఆర్డీఓ శేష శైలజ ఆదేశించారు. జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా రీసర్వే జరిగిన గ్రామాల్లో భూ హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న గ్రామాల్లో పంపిణీ విధానాన్ని ఆమె గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మండలంలోని రాముడువలస, కమ్మవలస గ్రామాల్లో ఆమె పాల్గొని ఈకేవైసీ జరుగుతోందా లేదానని పరిశీలించారు. తహసీల్దార్ డోల రాజేశ్వరరావుకు పలు సూచనలు చేశారు. రీసర్వేలో డీటీ అప్పయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

హర్షం

బొబ్బిలి: రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా కులగణనకు రాష్ట్ర అసెంబ్లీ బిల్లును ఆమోదించడం పట్ల రెల్లి కులాల సంఘ రాష్ట్ర నాయకులు గండి విజయకుమార్, బంగారి చిన్ని కృష్ణ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఇన్నాళ్లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోని అసెంబ్లీ కులగణనకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. దీని వలన ఆర్థిక, సామాజిక రంగాల్లో వెనకబడ్డ వారికి న్యాయం జరుగుతుందని భావిస్తున్నామన్నారు. వారి వెంట ఆ సంఘ నాయకులు ఉన్నారు.

అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న భక్తులు



రాజాం : కూరాకులవీధిలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

వంగర: అన్నదానం మహాదానమని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అన్నారు. మండల పరిధి కొట్టిశ గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మంటపం వద్ద గురువారం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం వినాయక విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.

రాజాంలో..

రాజాం : పట్టణంలోని శ్రీనివాసాకాలనీ, కూరాకులవీధి పరిధిలో వినాయక ఉత్సవం నేపథ్యంలో అన్నదానాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకుడు పాలవలస శ్రీనివాసరావు, నల్లా శ్రీనివాసరావు, ముగడ రవి, గుంటముక్కల సప్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

మారుతీనగర్‌లో..

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి మారుతీనగర్ కాలనీలో ఎంఎన్‌సీ యూత్ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. వినాయక ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సుమారు 10వేల మంది వరకు భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాట్నూరు లక్ష్మణరావు, గార గున్నంనాయుడు, రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయి, ఎంఎన్‌సీ యూత్ సభ్యులు ఎస్.మురళి, కె.శ్రీనివాసరావు, ఎస్.సునీల్, ఎస్.గౌతమ్, చంటి, వాసు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్

రాజాం సిటీ: విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు రూరల్ మండలాల్లోని గ్రామాలకు త్రీ ఫేజ్ సప్లై ఇచ్చేందుకు సర్వే చేపడుతున్నామని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.లక్ష్మణరావు అన్నారు. గురువారం స్థానిక ఏడీఈ కార్యాలయంలో సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణాలతో పాటు గ్రామాల్లో కూడా విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చేయడంతో పాటు భద్రతా చర్యలు కట్టుదిట్టం చేస్తున్నట్లు చెప్పారు. లైన్‌లాస్ తగ్గించాలని సిబ్బందికి సూచించారు. జగనన్నకు చెబుదాంలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే ప్రతి మీటర్‌కు ఆధార్ సీడింగ్ తప్పనిసరిగా చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఈ పి.సురేష్‌బాబు, ఏడీఈ ఫణీంద్రకుమార్, ఏఈలు ఏజేసీఏ కుమార్, వి.సురేష్‌కుమార్, వినయ్, హరి, సీతారాం, లావణ్య, లలిత, తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కోవిడ్-19 రిలీఫ్ టీమ్ సభ్యులు

రాజాం సిటీ: నేటితరం యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ అన్నారు. భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక గ్యాస్ కార్యాలయంలో కోవిడ్-19 రిలీఫ్ టీమ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కె.తిరుమలేశ్వరరావు, ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్, పెంకి చైతన్యకుమార్, బూరాడ శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.